
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



- బాబు ప్రసంగానికి జనాల నుంచి సూపర్ రెస్పాన్స్
- ఎన్నికల యుద్ధానికి కేడరును సిద్ధం చేసిన అధినేత

కమలాపురంలో శుక్రవారం నిర్వహించిన రా..కదలిరా బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడం.. రా కదలిరా అన్నట్లుగానే కేడరు, జనం కదలిరావడంతో టీడీపీ శ్రేణులు మాంచి జోష్‌లో ఉన్నారు. జిల్లా నడిబొడ్డున.. సీఎం జగన్ మేనమామ ఇలాకాలో వేలాదిమంది సాక్షిగా.. హూ కిల్డ్ బాబాయ్? మూడేళ్లలో స్టీలు ఫ్యాక్టరీ కట్టాడా..? ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా పూర్తిచేశాడా..? ఒక్క మండలాన్ని అయినా కరువు ప్రాంతంగా ప్రకటించాడా.. ? అంటూ చంద్రబాబు సంధించిన ప్రశ్నలకు జనం నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రతి పార్లమెంటు పరిధిలో బహిరంగసభలు ఏర్పాటు చేసి కేడరులో పౌరుషం నింపాలనుకున్న చంద్రబాబునాయుడి లక్ష్యం నెరవేరింది.



చంద్రబాబు సభ సక్సెస్‌తో..

టీడీపీలో జోష్

(కడప-ఆంధ్రజ్యోతి): ఓ వైపు వైసీపీ నుంచి చేరికలు.. మరో వైపు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాలతో తెలుగుదేశం పార్టీ నేతలు ఊరూరు, ఇళ్లిళ్లు తిరుగుతున్నారు. ఓ విధంగా చెప్పాలంటే నోటిఫికేషన్ రాకముందే ప్రచారాన్ని మొదలుపెట్టి జనాల్లో ఉన్నారు. కడప, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ సాగుతోంది. అలాగే వైసీపీ నేతలను టీడీపీలో చేర్చుకుంటూ చాపకింద నీరులా టీడీపీ బలాన్ని పెంచుకుంటూ వస్తోంది. తాజాగా చంద్రబాబు బహిరం సభ సక్సెస్ కావడంతో టీడీపీలో జోష్ పెరిగింది.

చంద్రబాబు ప్రసంగంపై రెస్పాన్స్ సూపర్

కమలాపురంలో శుక్రవారం జరిగిన రా.. కదలిరా బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగానికి సభికుల నుంచి సూసపర్ రెస్పాన్స్ వచ్చింది. చంద్రబాబు మాట్లాడేటప్పుడు జనమే కొన్ని పాయింట్లు గుర్తు చేస్తూ వచ్చారు. వివేకానందరెడ్డి హత్య కేసుపై మాట్లాడేటప్పుడు జనం నుంచి భారీ స్పందన లభించింది. జగన్ డబ్బా చానెల్‌లో గుండెపోటు అంటూ ప్రచారం చేసి, వివేకా కూతురు సునీత పట్టుబట్టడంతో విధిలేక పోస్టుమార్టం చేశారని చివరికి తనపై పెద్ద స్టోరివేశారని, బాలీవుడ్, హాలీవుడ్‌లను మించిన సస్పెన్స్, మలుపులు ఈ కేసులో ఉన్నాయని చంద్రబాబు చెప్పిన మాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. జగన్ సీఎం అయిన తరువాత మీరేమన్నా బాగుపడ్డారా, ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా, స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేశాడా, ప్రాజెక్టులు కట్టాడా అన్న మాటలపై జనాల్లో చర్చ నడిచింది. వర్షాభావం కారణంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఒక్క మండలాన్ని కూడా కరువు ప్రాంతంగా ప్రకటించలేదు. ఇది జిల్లా రైతులను తీవ్ర నిరాశకు గురిచేసింది. అయితే చంద్రబాబు కరువుపై మాట్లాడడంతో చర్చ నడిచింది.

స్టీలు ఫ్యాక్టరీ శంకుస్థాపనలతో సరి

వివేకా హత్య, స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం, ప్రాజెక్టుల చంద్రబాబు సంధించిన ప్రశ్నలకు తమ దగ్గర సమాధానాలు లేవని కొందరు వైసీపీ నేతలు చెబుతున్నారు. "స్టీలు ఫ్యాక్టరీ కోసం చంద్రబాబు శంకుస్థాపన చేస్తే ఎన్నికల స్టంట్ అంటూ గత ఎన్నికల్లో ప్రచారం చేశాం.. జగన్ సీఎం అయిన ఆరు నెలలకే టెంకాయ కొట్టి శంకుస్థాపన చేసి మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. ఇంతవరకు ఆ ఫ్యాక్టరీ అసలు పట్టాలే ఎక్కలేదు. దీనిపై నిరుద్యోగుల్లో అసంతృప్తి ఉంది. స్టీలు ఫ్యాక్టరీపై చంద్రబాబు వ్యాఖ్యలతో మనకు నష్టమే" అని వైసీపీ నేతలు అంతర్గత సంభాషణల్లో మాట్లాడుకున్నారని సమాచారం.

ఒక్క కాల్వ అయినా తవ్వారా..?

రైతులకు, వ్యవసాయానికి తానే బ్రాండ్ అంబాసిడర్ అని అధికారంలోకి వస్తే రైతుల సంక్షేమానికి పాటుపడతాం, రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ చేస్తాం, చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టులు అటకెక్కించారు.. జగన్ అధికారంలోకి వస్తే ఇవన్నీ పూర్తి చేస్తాం గత ఎన్నికల్లో వైసీపీకి భజనపరులుగా ఉంటూ మేధావుల ముసుగులో టీడీపీపై నీలి బ్యాచ్ ప్రచారం చేసింది. వాస్తవానికి అవుకు టన్నెల్ పూర్తి చేసి గండికోట ద్వారా పులివెందులకు చంద్రబాబు నీళ్లిచ్చారు. అయితే అప్పట్లో సాగునీటి నిపుణులమని, కడప జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడే మేధావులమని చెప్పుకునే నీలి మేధావులు దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు జగన్ సీఎం అయిన తరువాత వేలకోట్లతో సాగునీటి ప్రాజెక్టులకు శంకుస్థాపనలే తప్ప అవి పట్టాలెక్కలేదు. ఒక్క ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా.. ఒక్క కాల్వ అయినా తవ్వారా అని చంద్రబాబు వేసిన ప్రశ్నలకు జనాల్లో చర్చకు దారి తీసింది.

కరెంటు చార్జీలు పెంచమని చెప్పి..

ప్రతిపక్ష నేత హోదాలో జగన్ కరెంటు చార్జీలపై బహిరంగసభల్లో జనాలకు త్రీడీలో సినిమా చూపించారు. అధికరంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచమని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తానని చెప్పారు. అంటే రోజుకు 15, 16 గంటలు కరెంటు వాడుకోవచ్చు, టీవీ ఫ్యాన్లు వేసుకోవచ్చంటూ చెప్పారు. ప్రతిపక్షనేత హోదాలో జగన్ చేసిన ప్రసంగం వీడియోను చంద్రబాబు నాయుడు రా..కదలిరా సభావేదికపై చూపించారు. అప్పుడు అన్ని మాటలు చెప్పి.. ఇప్పుడు జగన్ సీఎం అయిన తరువాత 9సార్లు కరెంటు చార్జీలు పెంచి మీ అందరిపై భారం వేయలేదా అని ప్రశ్నించడంతో జనం నుంచి విశేష స్పందన వచ్చింది.

ఎమ్మెల్యేల అవినీతి చిట్టా

ఎమ్మెల్యేల భూ ఆక్రమణలు, అవినీతి దందాపై నియోజకవర్గాల వారీగా చిట్టా విప్పారు. తాము అధికారంలోకి రాగానే వారు మింగిందంతా కక్కిస్తామనడంతో మంచి రెస్పాన్స్ వచ్చింది. చంద్రబాబు వ్యాఖ్యలకు రాజకీయంగా కౌంటరు ఇవ్వాలే తప్ప ఇచ్చిన హామీలు ఏమీ చేయలేదని జనానికి బాగా తెలుసు. కౌంటరు ఇచ్చినా జనం నవ్వుతారు అంటూ వైసీపీ నేతలు గొణుక్కుంటున్నారు.



ఎన్నికలకు కేడరు సిద్ధం

జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో కేడరు, జనం తరలిరావడంతో కమలాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగసభ వేదిక ప్రాంగణం అశేష జనంతో పోటెత్తింది. దీంతో కేడరుకు మంచి జోష్ వచ్చింది. జనసేన సైనికులు కూడా మీటింగ్‌కు వచ్చారు. వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమని చంద్రబాబు చెప్పడం.. జనసంద్రంగా మారిన సభను చూసి కేడరులో కూడా జోష్ పెరిగింది. రాబోవు 80 రోజులు కష్టపడండి, మీ భవిష్యత్తు నేను చూసుకుంటానంటూ చంద్రబాబు హామీ ఇవ్వడం కేడరులో ఊపునిచ్చింది.

టీడీపీలో చేరికలు

కమలాపురంలో శుక్రవారం జరిగిన రా.. కదలిరా బహిరంగ సభకు హాజరైన చంద్రబాబు సమక్షంలో కడపకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఎండీహెచ్ నవీన్ సోదరుడు మహ్మద్, హిందూపురం నుంచి వైసీపీ ఎంపీగా పోటీ చేసిన లయన్ ఖాసింఖాన్ కుమారుడు మన్సూర్ ఆలీఖాన్ పార్టీలో చేరారు. వీరికి చంద్రబాబు నాయుడు కండువా కప్పి ఆహ్వానించారు. జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత గంగవరం శేఖర్‌రెడ్డి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు.





వైఎస్ షర్మిలకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

వైఎస్ షర్మిలకు ఘన స్వాగతం

- ప్రత్యేక విమానంలో కడపకు చేరుకున్న షర్మిల, రఘువీర, కేవీపీ
- మాజీ మంత్రి అహ్మదుల్లా కాంగ్రెస్‌లో చేరిక

కడప(కలెక్టరేట్)/వేంపల్లె, జనవరి 20: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కడప విమానాశ్రయంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఘన సాగ్వతం పలికారు. శనివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, మాజీ మంత్రి రఘువీరారెడ్డితో కలసి కడప విమానాశ్రయానికి చేరుకున్న షర్మిలకు పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాముల ఆధ్వర్యంలో గజమాల వేసి స్వాగతం పలికారు. షర్మిలకు మద్దతు తెలిపేందుకు దాదాపు 200 వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డిలు కడప నగరంతో పాటు విమానాశ్రయం వరకు కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్మిక విభాగం అధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్, ఎన్ఎస్‌యూఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వాహనాల్లో పెండ్లిమర్రి మండలం మీదుగా వేంపల్లెకు బయలుదేరారు. అక్కడ కూడా బాణాసంచా కాల్చి భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి ఇడుపులపాయ ఎస్టేట్‌కు చేరుకున్నారు. వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళి అర్పించిన అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, పీసీసీ ఉపాధ్యక్షులు బండి జకరయ్య, నజీర్ అహమ్మద్, నేతలు ఎస్‌ఏ సత్తార్, చీకటి చార్లెస్, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, అనంతపురం, అన్నమయ్య, నంద్యాల జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్‌లో మాజీ మంత్రి అహ్మదుల్లాకు షర్మిల కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల కోసం వైఎస్ ఆశయాల సాధనకోసం షర్మిల వెంట నడుస్తామని అహ్మదుల్లా తెలిపారు.



షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీమంత్రి అహ్మదుల్లా

లేని పార్టీకి ఒక ప్రెసిడెంటా..

- కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 20: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ జీరో అని, నామ్‌కేవాస్తి పార్టీల్లో కాంగ్రెస్ ఒకటని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో లేని పార్టీకి ఒక ప్రెసిడెంటును నియమించడం హాస్యాస్పదమన్నారు. శనివారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మేనమామ అనుకోవచ్చు, వైసీపీ కార్యకర్త అనుకోవచ్చు. లేని పార్టీగురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బిగ్ జీరో అని చెప్పారు. ఉన్న పార్టీలపై మాట్లాడితే ఏదైనా ప్రజలు హర్షిస్తారు కానీ ఏమీ లేనటువంటి పార్టీపై మాట్లాడడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బాలయాదవ్, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథాలయంలో కేంద్ర పర్యాటక శాఖ సలహాదారు

నందలూరు, జనవరి 20 : నందలూరు సౌమ్యనాథస్వామిని పార్లమెంటు సభ్యుడు (రాజ్యసభ), కేంద్ర పర్యాటక శాఖ సలహాదారు సుమేర్‌సింగ్ సోలంకి శనివారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి ఘనంగా సత్కరించారు. ఈయన వెంట జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్, రాష్ట్ర నాయకులు నాగోతు రమేశ్‌నాయుడు, మైనారిటీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు షబ్బీర్, అహమ్మద్, అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, గిరిజన మోర్చ నాయకులు పోతురాజు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథుని సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే: రాజంపేట మాజీ ఎమ్మెల్యే కసిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి శనివారం రాత్రి సౌమ్యనాథస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి తీర్థప్రసాదాలు అందజేసి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈయన వెంట ఆర్టీసీ మాజీ రీజనల్ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, ఆలయ మాజీ చైర్మన్ పల్లె సుబ్రమణ్యం, జనార్ధన్‌రెడ్డి, లంకయ్యగారి సుబ్బరామయ్య తదితరులు ఉన్నారు.



సౌమ్యనాథస్వామి ఆలయంలో కేంద్ర పర్యాటక శాఖ సలహాదారు సుమేర్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న పండితులు

అంగన్వాడీల సర్వమత ప్రార్థనలు

- 40వ రోజుకు చేరుకున్న సమ్మె

కడప, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలంటూ అంగన్వాడీలు సర్వమత ప్రార్థనలు చేశారు. వైఎస్ జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 40వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శనివారం పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్వాడీలు అల్లాను, ఏసును, ఈశ్వరుడిని ప్రార్థిస్తూ నిరసన తెలిపారు. బద్వేలులో పూలే విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేపట్టారు. కడప కలెక్టరేట్ వద్ద దీక్షా శిబిరం నుంచి మహవీర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. మైదుకూరులో రాయల్ కూడలి వద్ద రహదారిపై బైఠాయించారు. కొండాపురంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జమ్మలమడుగ ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్డులో ర్యాలీగా వెళ్లి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు.



పోరుమామిళ్లలో ఈశ్వరుడిని, ఏసును, అల్లాను ప్రార్థిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



మైదుకూరులో రోడ్డుపై బైఠాయించిన ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

రూ.43.5 లక్షల నగదు సీజ్

కడప (క్రైం), జనవరి 20: జిల్లాలో పోలీసులు శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.43.5 లక్షల నగదు పట్టుకున్నారు. రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో సీఐ కె.రామచంద్ర, ఎస్ఐ నారాయణ తమ సిబ్బందితో కలిసి పాలకొండల క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ39 ఎఫ్ జెడ్ 0405 నెంబరు కారులో కడప నగరం అక్కాయపల్లెకు చెందిన సయ్యద్ రియాజ్ మహ్మద్ అనే వ్యక్తి వచ్చారు. ఆ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న రూ.30 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కడప నగరం రెండో గాంధి బొమ్మ వద్ద టూటౌన్ సీఐ తబరేజ్ ఆధ్వర్యంలో బిస్మిల్లా నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ స్కూటీలో తీసుకెళుతున్న రూ.5లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కొండాపురం మండలంలోని ముచ్చుమర్రి వద్ద అనంతపురం నుంచి ఎర్రగుంట్లకు కారులో వెళుతుండగా సాయి గణేశ్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి రూ.8,50,000 లక్షల నగదు పోలీసులు సీజ్ చేశారు. మొత్తంగా శనివారం జిల్లాలో మూడుచోట్ల కలిపి రూ.43.5లక్షల నగదు స్వాధీనం చేసుకుని ఐటీ అధికారులకు అప్పగించారు.



సీజ్ చేసిన నగదుతో రిమ్స్ పోలీసులు

గ్రామాల్లో నిఘా పెంచాలి : ఎస్పీ



కడప (క్రైం), జనవరి 20: రానున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో నిఘా ముమ్మరం చేయాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి ఎలక్షన్ ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించి వారికి దిశానిర్దేశం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలపాలని ఆదేశించారు. ట్రబుల్ మాంగర్లు, చెడు నడత గల వారి కదలికలపై నిఘా పెంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్లు కె.అశోక్‌రెడ్డి, జి.రాజు, జిల్లాలోని ఎస్బీ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావడం చారిత్రక అవసరం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 20: రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమలాపురంలో జరిగిన రా..కదలిరా బహిరంగ సభ ఒక చారిత్రక ఘట్టమని, భారీగా జనం ఈ సభకు తరలి వచ్చారన్నారు. ఈ సభ ద్వారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధి గురించి, వైసీపీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు, భూకబ్జాల గురించి ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించారన్నారు. వైసీపీ పాలనలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని, అది ఒక్క చంద్రబాబు నాయుడికే సాధ్యమన్నారు. కమలాపురం సభ ద్వారా సీఎం జగన్‌కు సొంత జిల్లాలోనే తీవ్ర వ్యతిరేకత ఉందని తేలిపోయిందని, పులివెందులతోపాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపునకు ఈ సభ బాటలు వేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోగా, ప్రజలపై పన్నుల భారం మోపిందని, దీనివల్ల ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. చంద్రబాబు ప్రతిష్టను దెబ్బతీయడానికి తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మైదుకూరు జనసేన పార్టీ ఇన్‌చార్జి మల్లోత్ర మాట్లాడుతూ రైతు లు కరువుతో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. వైసీపీ పాలనలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని, జగన్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. సమావేశంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సిద్ధయ్య, తెలుగు యువత జిల్లా కార్యదర్శి రాము నాయుడు, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రప్ప, సుబ్బరాజు పాల్గొన్నారు.

'సామాజిక న్యాయం గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు'

వేంపల్లె, జనవరి 20: సామాజిక న్యాయం గురించి మాట్లాడే నైతిక హక్కు ముఖ్యమంత్రి జగన్‌కు లేదని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఎస్సీల మీదనే ఎస్సీచట్టాన్ని ప్రయోగించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు జగన్ తిలోదకాలిచ్చాడన్నారు. దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను వైసీపీ నాయకులు చంపి డోర్ డెలివరీ చేశారని, విశాఖలో డాక్టర్ సుధాకర్, కడప జిల్లాలో డాక్టర్ అచ్చెన్న ప్రభుత్వ వేధింపులకు మరణించారన్నారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు.

ఎస్ఈబీలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐల బదిలీ

మదనపల్లె టౌన్, జనవరి 20: జిల్లాలో ఎస్ఈబీ పోలీసు శాఖలో ఇన్‌స్పెకర్లు, ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్ఈబీ కమిషనర్ రవికుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని లక్కిరెడ్డిపల్లె ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ విన్నిలతను ఆదోనికి, రాయచోటి ఇన్‌స్పెక్టర్ ధీరజ్‌రెడ్డిని మడకశిరకు, రాజంపేట ఇన్‌స్పెక్టర్ శ్రీహరిని చంద్రగిరికి, వాయల్పాడు ఇన్‌స్పెక్టర్ శివసాగర్‌ను గుత్తికి బదిలీ చేశారు. అలాగే పీలేరు ఇన్‌స్పెక్టర్ గురుప్రసాద్‌ను ధర్మవరానికి, చీకిలబైలు చెక్‌పోస్టు ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మమ్మను అనంతపురం డీటీఎఫ్‌కు, అన్నమయ్య ఇంటెలిజెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ నాగేంద్రమ్మను కదిరికి, ములకలచెరువు ఇన్‌స్పెక్టర్ మల్లికను సుంకేశుల చెక్‌పోస్టుకు, మదనపల్లె ఇన్‌స్పెక్టర్ మురళికిశోర్‌ను కణేకల్లుకు, రామసముద్రం చెక్‌పోస్టు ఇన్‌స్పెక్టర్ సరితారెడ్డిని లక్కిరెడ్డిపల్లెకు బదిలీ చేశారు. అదేవిధంగా జిల్లాలోని రాజంపేట ఎస్ఐ ఇస్మాయిల్‌ను ఆదోనికి, లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ కిశోర్‌కుమార్‌ను ప్రొద్దుటూరుకు, రాయచోటి ఎస్ఐ థామస్ విన్సెంట్‌ను పంచలింగాల చెక్‌పోస్టుకు, రైల్వే కోడూరు ఎస్ఐ నరసింహరావును పులివెందులకు బదిలీ చేశారు. రాయచోటి డీటీఎఫ్ ఎస్ఐ హేమకుమార్‌ను మదనపల్లె డీటీఎఫ్ విభాగానికి, ములకలచెరువు ఎస్ఐ నారాయణస్వామిని కర్నూలు జిల్లా భాపురం చెక్‌పోస్టుకు, మదనపల్లె ఎస్ఐ అంజాద్‌బాషాను నంద్యాలకు, వాయల్పాడు ఎస్ఐ భాగ్యలక్ష్మిని తిరుపతి డీటీఎఫ్‌కు, మదనపల్లె డీటీఎఫ్ ఎస్ఐ వై.బాబును సిద్దవటం స్టేషన్‌కు, మదనపల్లె బీఎంపీపీ ఎస్ఐ రాజశేఖర్‌ను కర్నూల్‌కు, చీకిలబైలు చెక్‌పోస్టు ఎస్ఐ శివకృష్ణమ్మను ఎమ్మిగనూరు బీఎంపీపీకి బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వారి స్టేషన్‌లకు రిలీవర్లు వచ్చిన వెంటనే బదిలీ అయిన స్థానాల్లో చేరాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతి చెందిన మహిళ

పెండ్లిమర్రి, జనవరి 20: కడప-పులివెందుల ప్రధాన రహదారిపై పెండ్లిమర్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం రాత్రి మేకల పార్వతి (42) అనే మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... కోరవాండ్లపల్లె బీసీ కాలనీకి చెందిన పార్వతి కూలి పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా కడప వైపునకు చామంతిపూల లోడుతో వెళ్తున్న క్యాంపర్ ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

నీటిగుంతలో పడి బాలుడు మృతి

వేంపల్లె, జనవరి 20: మండలంలోని పాపాఘ్ని నది గండి బ్రిడ్జి వద్ద నీరున్న ఇసుక గుంతలో పడి పది సంవత్సరాల బాలుడు మృతి చెందాడు. ఆడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు తెలిసింది. ఆర్కేవ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఇడుపులపాయ ఎస్సీ కాలనీకి చెందిన బాలుడు అని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- రూ.20 లక్షల ఆస్తినష్టం


మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


కడప (క్రైం), జనవరి 20 : నగరంలోని తాజ్‌నగర్ బజాజ్ షోరూం వద్ద గల షేక్ మహ్మద్ జావేద్ టింకరింగ్ షెడ్డు, వెల్డింగ్ షాపులో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో టింకరింగ్ షాపుతో పాటు అక్కడ ఉన్న రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక అధికారి బస్విరెడ్డి తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.20 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు షాపు యజమానులు తెలిపారు. తమకు జీవనాధారం ఆ షాపులేనని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హోటల్‌లో విజిలెన్స్ తనిఖీలు


సీజ్ చేసిన సిలిండర్లతో అధికారులు

కడప (క్రైం), జనవరి 20 : సిద్దవటం మండలం మాధవరం గ్రామంలోని ఓ హోటల్‌ను కడప విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీ నిర్వహించారు. కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫీసర్ షేక్ మాసుం బాషా ఆదేశాల మేరకు ఆ హోటల్‌ను తనిఖీ చేయగా గృహావసరాలకు ఉపయోగించే 4 ఇండేన్, ఒక హెచ్‌పీ సిలిండర్లు మొత్తం ఐదు సిలిండర్లను హోటల్‌లో వాడుతున్నట్లు గుర్తించారు. ఆ మేరకు ఆ సిలిండర్లను సీజ్ చేసి సిద్దవటంలోని షిర్డీ సాయి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. మాధవరానికి చెందిన హోటల్ యజమాని ఎ.మల్లిఖార్జునపై కేసు నమోదు చేశారు. హోటల్ యజమానులందరూ వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడరాదని, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను వాడాలన్నారు. లేదంటే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఈదురుబాషా, రెడ్డెప్ప, బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ సౌజన్య, హెడ్‌కానిస్టేబుల్ క్రిష్ణానాయక్ పాల్గొన్నారు.

ముచ్చుమర్రి వద్ద రూ.8.50 లక్షలు సీజ్


సీజ్ చేసిన నగదుతో ట్రైనీ డీఎస్పీ ఎస్‌ఐ

కొండాపురం, జనవరి 20 : మండలంలోని ముచ్చుమర్రి పునరావాస కేంద్రం వద్ద శనివారం సాయంత్రం పోలీసులు రూ.8.50 లక్షల నగదు సీజ్ చేశారు. ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, కొండాపురం ఎస్‌ఐ యోగీంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ నగదును స్వాధీనపరచుకున్నారు. అనంత పురం నుంచి ఎర్రగుంట్లకు కారులో వెళుతుండగా సాయిగణేశ్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎర్రగుంట్ల మండలం పెద్దనపాడుకు చెందిన సాయిగణేశ్‌రెడ్డి సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

కడపలో రూ.5 లక్షలు....

కడప (క్రైం), జనవరి 20 : కడప నగరం రెండో గాంధీ బొమ్మ వద్ద టూటౌన్ సీఐ తబరేజ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. కడప బిస్మిల్లానగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ అనే వ్యక్తి ఎలాంటి బిల్లులు లేకుండా రూ.5 లక్షలు నగదు స్కూటీలో తీసుకెళుతుండగా ఆ నగదును పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన నగదును ఐటీ శాఖకు అప్పగించామని సీఐ తెలిపారు.

మట్టి రాళ్లతో చదును చేసిన మాన్యం భూమి


జేసిబీతో చదును చేస్తున్న మాన్యం భూమి



చెన్నకేశవాలయం గాలిగోపురం

ఆలయ భూములు..
ఆక్రమణ యత్నం

- దొరసానిపల్లె భూములలో పార్కు నిర్మాణానికి ఎమ్మెల్యే యత్నం
- చెన్నకేశవ ఆలయానికి ఆస్తులున్నా.. ఆదాయం నిల్
- లీజుకివ్వని సాగు భూములు
- పదిహేడేళ్లుగా బీడుపడ్డ వైనం
- పట్టించుకోని దేవదాయ శాఖ

ప్రొద్దుటూరు, జనవరి 20: దసరా ఉత్సవాలు జరపడంలో దేశంలోనే రెండవ మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో ఆలయాల అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఆలయాల భూములను సకాలంలో లీజులకు ఇవ్వకపోగా.. ఆలయ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు అడ్డుకున్న దాఖలాలు లేవు. ప్రొద్దుటూరు పట్టణం నడిబొడ్డున పాతమార్కెట్‌లో పురాతన చెన్నకేశవాలయం ఆలనా పాలనా లేక అధ్వాన్న స్థితిలో ఉంది. ఈ ఆలయం గాలిగోపురం ముందు, ఆలయం ప్రాగణంలో కనీసం బండపరుపు సైతం సక్రమంగా లేదు.

అంతేకాకుండా ఆలయంలో పురాతన మంటపం శిథిలావస్థకు చేరుకుంది. ఈ పురాతన మంటపంలో ఒకప్పుడు వివాహాలు, ఉత్సవాలు జరిగేవి. ఆలయప్రాగంణం అంతా ఎత్తు చేయడంతో గర్భగుడి తగ్గులో ఉంది. ఈ ఆలయాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో నేడు కసువు ఊడ్చే సిబ్బందికి, ఆలయ పూజారులకు సైతం జీతాలు చెల్లించలేని స్థితికి చేరుకుంది.

విలువైన భూములున్నా...

చెన్నకేశవాలయానికి ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామంలోని సర్వేనెంబరు 152 బీలో 10.06 ఎకరాలుంది. దొరసానిపల్లె సర్వేనెంబరు 40/3లో 3.97 ఎకరాలు, చౌటపల్లె వద్ద బొల్లవరం పొలం సర్వేనెంబరు 429లో 3.07 ఎకరాలు ఉన్నాయి. చాపాడు మండలం మడూరు గ్రామంలో సర్వేనెంబరు 192-బీ2లో 1.02 ఎకరాలు, సర్వేనెం 194లో 9.87 ఎకరాలు ఉన్నాయి. గోపవరం, మడూరు భూములద్వారా మాత్రమే ఏడాదికి రూ.80 వేలు లీజు వస్తుంది. ఆలయం చుట్టూ ఉన్న 12 అద్దెగదులకు నెలకు రూ.42 వేలు అద్దె వస్తున్నట్లు ఆలయ అధికారులు తెలుపుతున్నారు. అద్దెగదుల ఆదాయం, దసరా, వైకుంఠ ఏకాదశినాడు వచ్చే హుండీ ఆదాయం తప్ప ఈ ఆలయానికి ఆదాయం లేదు.

నాలుగు ఎకరాలు చదును చేసిన ఎమ్మెల్యే

గోపవరం, చౌటపల్లె, దొరసానిపల్లెలోని ఆలయ భూములు కోట్ల రూపాయల విలువ చేస్తాయి. చౌటపల్లె, దొరసానిపల్లె వద్ద ఉన్న ఆలయ భూములను పదిహేడేళ్లుగా లీజుకు ఇవ్వక బీడు పడిపోయాయి. కాగా.. దొరసానిపల్లె సర్వేనెంబరు 40/3లో ఉన్న 3.97 ఎకరాల ఆలయ భూమి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఇంటిముందు ఉంది. గతంలో ఇందులో వ్యవసాయం చేసేశారు. దీనిని లీజుకు ఇవ్వకుండా కొందరు రాజకీయ నాయకులు అడ్డుకుంటున్నట్లు సమాచారం. ఈ భూమి ఎదురుగా ఎమ్మెల్యే నివాసం ఉండటంతో దానిని దొరసానిపల్లె పంచాయతీకి లీజుకు ఇచ్చేలా, అక్కడ పార్కు నిర్మించాలని దేవదాయ శాఖకు ఉత్తరాలు రాశారు. తమ భూమిని పంచాయతీకి లీజుకు ఇచ్చే విషయంలో దేవదాయ శాఖ ఏ నిర్ణయం తీసుకోలేదు. అయినా.. ఆ భూమిలో పెద్ద ఎత్తున మట్టి వ్యర్థాలు తోలి చదును చేసే పనులను అనధికారికంగా ఎమ్మెల్యే చేపట్టారు. ఇప్పుడు ఆ భూమి లీజుకు ఇవ్వాలన్నా వ్యవసాయ సాగుకు అనుకూలంగా లేకుండా పోయింది. నాలుగెకరాల దేవుని మాన్యంలో పార్కు నిర్మించి తన ఇంటి ముందు ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే తలచారు. ఆ మేరకు దేవదాయ శాఖ అధికారులు స్పందించకపోయినా.. ఎమ్మెల్యే ఆ భూమిని చదును చేసి తన ఇంటి ముందు భారీ పార్కింగ్ ఏర్పాటు చేసుకున్నారు.

లీజుకు ఇవ్వడానికి పంచాయతీకి అనుమతులు లేవు..

దొరసానిపల్లె పంచాయతీకి పార్కు నిర్మాణం కోసం లీజుకు ఇవ్వడానికి దేవదాయ శాఖ అనుమతులు ఇవ్వలేదు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి రెండేళ్లక్రితం దేవదాయ శాఖకు లెటర్‌పెట్టారు. ఆ భూమిలో కంపచెట్లు మొలిచి అశుభ్రంగా ఉంటే దానిని ఎమ్మెల్యే శుభ్రం చేసి మట్టి వ్యర్థాలు తోలి చదును చేశారు. చదును చేయడానికి దేవదాయ శాఖ అనుమతులు ఇవ్వలేదు.

- జగన్‌మోహన్‌రెడ్డి, ఆలయ ఈవో ప్రొద్దుటూరు


ఎమ్మెల్యే ఇంటిముందు పార్కుగా మార్చాలనుకున్న మాన్యం భూమి


శిథిలావస్థకు చేరిన దేవాలయంలోని ఉత్సవ మంటపం

లోక్ అదాలత్‌తో సత్వర సేవలు

జిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్



మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 20 : సేవా రంగాల్లో లోపాలకు సత్వర న్యాయం లోక్‌అదాలత్ ద్వారా పొందవచ్చని జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ చైర్మన్ స్వర్ణప్రసాద్ తెలిపారు. శనివారం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా శాశ్వత లోక్ అదాలత్ ప్రజాప్రయోజిత న్యాయ సేవా అవగాహన కార్యక్రమం వైవీయూలో నిర్వహించారు. వైవీయూ లీగల్ సెల్ నోడల్ అధికారి ఆర్‌వీ జయంత్ కశ్యప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి అధ్యక్షత వహించారు.

చైర్మన్ స్వర్ణప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ద్వారా ప్రతి పౌరుడు న్యాయం పొందే హక్కు కల్పించిందన్నారు. అందులో భాగంగా అవసరమైన ప్రజలకు సత్వర న్యాయాన్ని అందించేందుకు శాశ్వత లోక్ అదాలత్ పనిచేస్తుందన్నారు. ఇక్కడ లభించే తీర్పు సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో సమానమని, తీర్పు వెలువడ్డాక హైకోర్టుకు అప్పీలు అనేది ఉండదని స్పష్టం చేశారు. కోటి విలువ గల వివాదాలు ఇక్కడ ప్రజా ప్రయోజిత సేవా రంగాలకు సంబంధించి రవాణా సమాచార, విద్యుత్, నీటిసరఫరా గ్రామ పంచాయతీ మున్సిపాలిటీ, ప్రజాసేవలు ప్రజారోగ్యం బీమా సౌకర్యాలు, విద్యా సంస్థలు, స్థిరాస్తి వ్యాపారం, ఉపాధి హామీ, బ్యాంకుల సేవా లోపాలు ఎదురైనప్పుడు పర్మనెంటు లోక్ అదాలత్ సత్వర సేవలు పొందవచ్చన్నారు. 90 రోజుల్లోపు బాధితులకు సాంత్వన కల్పిస్తామని, గతంలో వెలువడిన తీర్పులను ఉదహరిస్తూ అవగాహన కల్పించారు.

వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ మాట్లాడుతూ న్యాయపర సమస్యల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అన్నారు. అనంతరం న్యాయపరమైన సందేహాలను చైర్మన్ దృష్టికి తేగా న్యాయపరంగా సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో వైవీయూ రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సు, కారు డ్రైవర్ల మధ్య ఘర్షణ

రాయచోటి టౌన్, జనవరి 20 : రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఆర్టీసీ బస్సు, కారు డ్రైవర్ల మధ్య జరిగిన ఘర్షణపై శనివారం రాయచోటి అర్బన్ పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు...కడప నుంచి బెంగళూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో బస్సును రోడ్డుకు అడ్డంగా పెట్టాడని కారు డ్రైవర్ మందా గణేశ్ ఆగ్రహంతో బస్సు అద్దాలను పగలగొట్టి తనపై దాడి చేశాడని బస్సు డ్రైవర్ ఫిర్యాదు చేశారన్నారు. అలాగే బస్సును రోడ్డుకు అడ్డంగా పెట్టడమే కాకుండా తనపై దాడి చేశారని కారు డ్రైవర్ ఫిర్యాదు చేశాడన్నారు. ఇరువురు డ్రైవర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ప్రపంచబ్యాంకు ప్రతినిధుల విచారణ

ప్రొద్దుటూరు, జనవరి 20 : గ్రామాల్లోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో జరుగుతున్న కుటుంబ వైద్యుల కార్యక్రమంతో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ప్రపంచ బాంకు ప్రతినిధులు డాక్టర్ రజత్, డాక్టర్ ఇర్ఫాన్ గ్రామాల్లో ప్రజలను విచారించారు. శనివారం మండల పరిధిలోని కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని దొరసానిపల్లె కొత్తపల్లెలోని ఐదు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారికి వైద్యపరంగా ఇంకా ఎలాంటి సేవలు కావాలో వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కడప నుంచి డాక్టర్ ఆరీఫ్ కల్లూరు, కామనూరు వైద్య అధికారులు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్ సీహెచ్‌వోలు దివ్యలక్ష్మీ, రజియా, క్రిష్ణమ్మ, హెచ్ ఈవో రాజశేఖర్ సూపర్‌వైజర్స్ బీఏ వరప్రసాద్, చంద్రకళ, మాధవరెడ్డి, సీహెచ్‌వో గౌతమి, ప్రణీత, కళ్యాణి, ఆరోగ్య కార్యకర్తలు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.



కావలెను
షాపులో పనిచేయుటకు స్త్రీ / పు పార్ట్‌టైం, ఫుల్‌టైం 10th P / F కావలెను. కడప, BKM Street, Cell : 94915 52483
Ajc-000

బట్టల షాపులో పనిచేయుటకు
కడప మురళీ హ్యాండ్‌లూమ్ షాపులో పనిచేయుటకు లేడీస్ & జంట్స్‌కావలెను. జీతం:లేడీస్-8000 to 15000, జంట్స్-10000 to 15000 వరకు. అనుభవం, కడపలోకల్ ఉన్నవారికి ప్రాధాన్యత, సంప్ర.వై.వి.స్ట్రీట్(జి.ఎం.స్ట్రీట్) సెల్: 94409 56331
Ajc-176322

క్యాషియర్స్ కావలెను
కడప బకెట్ బిరియాని రెస్టారెంట్ నందు పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ పనిచేయుటకు క్యాషియర్స్ కావలెను. కడప లోకల్ వారికి ప్రాధాన్యత Cont. : 98667 68892, 98850 10546
Ajc-176323

WANTED
PRO's & Mentors, AGM's Schools & College for Vowel Group of Institutions. No Posts: 15. Working in Nellore, Kavali, Salary: 20,000 to 30,000, Insentivews. Date 20th & 21 Jan. Cont NLR: 87126 11403, 87126 11346, 87126 11345. Cont KVL: 87126 11346, 87126 11402
AJR-156718

బాడుగకు ఇవ్వబడును
కడప నగరంలో క్రొత్త బైపాస్, వై.ఎస్.ఆర్. విగ్రహం సర్కిల్ దగ్గర రాజంపేట రోడ్డు, పద్మావతి నగర్ వద్ద 100x70 అడుగులుగల స్థలం, చుట్టూ ప్రహరిగోడ, లోపల 16x50 అడుగులుగల షెడ్డు బాడుగకు ఇవ్వబడును. బాత్‌రూమ్, వాటర్ సౌకర్యము కలదు. సెల్ : 92478 10338
Ajc-185210

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
కడపలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Q : 5th - 10th P/Fail. డ్యూటీ : 12 గంటలు, జీతం : 10,000/- సంప్ర : 97035 08754, 70950 04007
Ajc-176315

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 150698

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

కలగానే 30 పడకల ఆసుపత్రి

- ఎన్నికల హామీలు మరిచిన ప్రజాప్రతినిధులు
- సరైన వైద్యం అందక ప్రజల ఇక్కట్లు

సుండుపల్లె, జనవరి 20: సుండుపల్లె మండలం ఓ మారుమూల ప్రాంతం. సుమారు లక్షకుపైగా జనాభా కలిగిన మండలంలో సరైన వైద్యం అందక నిరుపేద కుటుంబాలు వందలు, వేల రూపాయలు వెచ్చించి ప్రైవేటు వైద్యం పొందాల్సిన దయనీయ పరిస్థితి ఈ మండలంలో దాపురించింది. 14 గ్రామ పంచాయతీల్లో 261 పల్లెల నుంచి ప్రజలు నిరంతరం మండల కేంద్రానికి పలు రోగాలతో వచ్చే పరిస్థితి ఉన్నా ప్రభుత్వ వైద్యం రోగులకు అందని ద్రాక్షలా మారిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014లో ఎన్నికల అనంతరం మండలంలోని పలువురు మండల నాయకులతో కలిసి ప్రభుత్వ వైద్యశాలలో సమావేశాలు నిర్వహించిన ప్రతిసారీ ఓట్లు వేయించుకున్న ప్రజాప్రతినిధులు శాలువాలతో సన్మానాలు చేయించుకొని కేవలం ఓట్లు దండుకునేందుకు సుండుపల్లెలో నేడో రేపో 30 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేస్తామని గాలి మాటలు చెప్పడం తప్ప వారు హామీలు నెరవేర్చిన పాపాన పోలేదని ప్రజలు వాపోతున్నారు. మళ్లీ 2019 ఎన్నికల సమయంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలు 30 పడకల ఆసుపత్రిని తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పిన మాటలు నేటికీ నీటిపై రాతల్లానే మిగిలిపోయాయి. వేల మంది శ్రేయస్సు కోసం 30 పడకల ఆసుపత్రిగా ప్రస్తుతం ఉన్న వైద్యశాలను నిర్మించే హామీని మరిచిపోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శలు వస్తున్నాయి. ఆసుపత్రిలో కనీసం ప్రసవాలు జరిగినా కూడా తల్లిబిడ్డతో పాటు ఇతర రోగులు ఉండలేని దయనీయ పరిస్థితి సుండుపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఉంది. పాలకులు ఏనాడైనా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధిని పట్టించుకున్నారా మళ్లీ 2024 ఎన్నికలు వస్తున్నాయి. మళ్లీ వచ్చి అవే హామీలు గుప్పించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేయడం తప్ప ఇంకేమీ లేదని ప్రజలు బహిర్గతంగా మాట్లాడుకుంటున్నారు. 30 పడకల ఆసుపత్రి మంజూరై పూర్తయితే మారుమూల మండలంలోని నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సరైన వైద్యం అందక అనేకమంది ప్రాణాలు కోల్పోవాల్సిన దయనీయపరిస్థితి ఏర్పడింది. అత్యవసర సేవలు అవసరమైతే ఇక్కడి నుంచి కడప, తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లేలోపు రోగులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చాలానే ఉన్నాయి. గర్భిణులకు ప్రసవం చేయించాలన్నా కనీస వసతులు కూడా లేని దౌర్భాగ్య స్థితిలో ఇక్కడి ఆస్పత్రి ఉందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల నాటికైనా 30 పడకల ఆసుపత్రిగా సుండుపల్లె ప్రాథమిక వైద్య కేంద్రానికి శంకుస్థాపన చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సుండుపల్లె ప్రాథమిక వైద్యశాల


ఆసుపత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

30 పడకల ఆసుపత్రి నిర్మించాలి



స్థానిక వైద్యశాలలో రోగులకు సరైన వైద్యం అందడం లేదు. సరైన వసతులు కూడా లేవు. మండల నలుమూలల నుంచి రోగులు వస్తారు కానీ వైద్యశాలలో వైద్యులు ఉండరు. ఎప్పుడో ఉదయం 10 గంటల తర్వాత వస్తారు. మధ్యాహ్నం 2 గంటలకే వెళ్లిపోతున్నారు. అసలు రోగులు వైద్యశాలకు రావడమే మరిచిపోతున్నారు. 30 పడకల ఆసుపత్రి నిర్మిస్తే మండల ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతుంది.

- రమణయ్య, సుండుపల్లె

రోడ్డు విస్తరణ తొలగింపు పనుల్లో గోల్‌మాల్

● ఆర్‌అండ్‌బీ ఈఈకి టీడీపీ నేతల ఫిర్యాదు

వేంపల్లె, జనవరి 20: వేంపల్లెలో రోడ్డు విస్తరణలో భా గంగా తొలగింపు పనులకు సంబంధించి రూ.1.30 కోట్ల నిధులలో అక్రమాలు జరిగాయని టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జి ల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ దర్బార్ ఆరోపించారు. ఇం దులో ఎంత నిధులను డ్రా చేసుకున్నారో పూర్తి వివరాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద రోడ్డు భవనాల శాఖ ఈఈకి వినతిపత్రంతో కూడిన ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి తొలగించుకోవడం వృథా మట్టి వస్తువులను దూరంగా తరలించుకోవడం వంటి పనులు చాలా వరకు ఇళ్లకు సంబంధిం చిన వారే చేసుకున్నారన్నారు. ఇందుకు సం బంధించి మంజూరైన నిధులలో అధికారులు, కాంట్రాక్టర్లు స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, పూర్తిస్థా యిలో విచారించాలని అధికారులను కోరినట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

పీఆర్సీ కమిషన్ వేశారు.. అమలు మరిచారు: ఎస్టీయూ

కడప (ఎడ్యుకేషన్), జనవరి 20 : రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి దాని అమలును విస్మరించిందని ఎ స్టీయూ జిల్లా అధ్యక్ష, ప్ర ధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంఘమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివా రం కడప నగరం ఎస్టీ యూ భవన్‌లో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సంక్రాంతికి ఉద్యోగ, ఉపాధ్యాయులు 12వ పీఆర్సీకి సంబంధించిన మధ్యంతర భృతి ప్రకటిస్తారని ఎంతో ఆశగా ఎదురు చూశా రని, అయితే ప్రభుత్వం కేవలం కమిషన్ వేసి చేతులు దులుపుకోవడం పట్ల ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన నెల కొందన్నారు. కమిషన్‌కు ఇంత వరకు సిబ్బందిని కూడా నియమించలేదన్నారు. విద్యాసంవత్సరం పూర్తి కావస్తున్నా నాడు-నేడుకు గాను ప్రధానోపాధ్యాయులు స్వంతంగా చేసిన ఖర్చులు తిరిగి చెల్లించలేదన్నారు. ఉద్యోగులకు రావాలసిన ఏపీజీఎల్ఐ, పీ ఆర్సీ బకాయిలు, టీఏ బకాయిలు, సరెండు లీవు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోగా అయినా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ నాయకులు రాంమోహన్, రవిశంకర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.





వైసీపీకి ఘోర పరాజయం తప్పదు

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 20 : రాష్ట్రంలో త్వరలో జరగ బోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్ప దని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. శనివారం కడప నగరం 41వ డివిజన్ బిల్టప్ సమీపంలో స్థానిక యువ కులు, మహిళలు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. వారిని శ్రీనివా సులరెడ్డి, మాధవీరెడ్డిలు టీడీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలో కి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క సారి అవకాశమని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ప్రజా వ్యతి రేక పాలన సాగించి ప్రజా వ్యతిరేకత మూటకట్టుకున్నారన్నా రు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. రాష్ట్రం బా గుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలని ప్రజలం దరూ కోరుకుంటున్నారన్నారు. ఎక్కడికి వెళ్లినా టీడీపీకి ఉప్పె నలా ప్రజాదరణ వస్తుందనితెలిపారు.

వాసు, మాధవీరెడ్డిలకు ఘన స్వాగతం

బిల్టప్‌లో స్థానిక యువకులు ఘనంగా టీడీపీ పొలిట్‌బ్యూరో స భ్యుడు శ్రీనివాసరెడ్డి, ఇన్‌ఛార్జ్ మాధవీరెడ్డిలను స్వాగతించారు. క్రేన్ సాయంతో గజమాలను అలంకరింపజేసి టపాసులు మో తతో ఘనంగా స్వాగతం లికారు. నగర అధ్యక్షుడు శివకొండా రెడ్డి,శ్రీధర్, సుధాకర్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.



గజమాలతో సత్కరించిన టీడీపీ కార్యకర్తలు

రా కదలిరా.. పిలుపునకు ప్రజల నీరాజనం

● టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 20 : కమలాపురంలో జరిగిన రా ..కద లిరా భారీ బహిరంగ సభ విజయవంతమైం దని టీడీపీ జిల్లా ప్ర ధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ తెలిపారు. శని వారం రా కదలిరా సభ ను విజయవంతం చేసి నందుకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలా పురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పుత్తా నరసింహారెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా వికాస్ హరిక్రిష్ణ మాట్లాడుతూ చంద్రబాబు రా కదలిరా బహిరంగసభ విజయవంతానికి సహకరించిన అన్ని నియో జకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఇది ప్రజల్లో కలిగిన మార్పునకు నిదర్శ నమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ టీడీపీకి పట్టం కడతారని కడప పార్లమెం టులోని మెజార్టీస్థానాలు టీడీపీ కైవసం చేసుకుంటుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



పుత్తా నరసింహారెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన హరిప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జన వరి 20 : పసుపులేటి సరస్వత మ్మ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో మాజీ మం త్రి పసుపులేటి బ్రహ్మయ్య 68 వ జయంతి సందర్భంగా నూ తన సంవత్సర క్యాలెండరును శనివారం సాయంత్రం హరిట వర్స్‌లో ఆయన కుమారుడు పసుపులేటి పవన్‌కుమార్, టీ డీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ పసుపులేటి సరస్వతమ్మ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్టు ద్వారా స్కూళ్ల, దేవాలయాల నిర్మాణాలకు సహాయం అందిస్తూ సమాజ సేవ లో ఎన్నో కార్యక్రమాలు చేస్తున్న ట్రస్టు చైర్మన్ రెడ్డి పవన్‌కు మార్ అభి నంద నీయుడన్నారు. జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, టీడీపీ మైనార్టీ నాయకుడు అమీర్‌బాష, అభిమానులు పాల్గొన్నారు.



క్యాలెండరు ఆవిష్కరిస్తున్న హరిప్రసాద్, పవన్‌కుమార్

వైవీయూలో ఓబీసీ సెల్ వెబ్‌సైట్ ప్రారంభం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 20 : వైవీయూ, ఇతర వెనుకబడిన తరగతుల విభాగం బ్రోచర్ వెబ్‌సైట్‌ను వైవీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి శనివారం ప్రారంభించారు. అనం తరం వారు మాట్లాడుతూ వైవీయూ ఓబీసీ సెల్ డైరెక్టరు క్రిష్ణారావు, సభ్యులు గంగయ్య, పార్వతి ఆధ్వర్యంలో ఓబీసీ విభాగం పనిచేస్తుందన్నారు.

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: డీవైఎఫ్‌ఐ

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 20:జిల్లాలో నిబంధనల కు విరుద్ధంగా కొనసాగుతున్న బీఈడీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జి ల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. శని వారం వైవీయూలో సీడీసీ రఘుబాబును కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడు తూ జిల్లాలో చాలా వరకు కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని, యూ నివర్సిటీ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. యథేచ్ఛగా అంగట్లో సరుకులు లాగా వేల రూపా యలకు ఇతర రాష్ట్రాల నుంచి అడ్మిషన్లు చేర్చు కుంటూ అక్రమార్గాల్లో నడుపుతున్నారని ఆరోపిం చారు. దీనిపై వైవీయూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు లేవన్నారు. ఇ ప్పటికైనా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. డీవైఎఫ్‌ఐ నాయకులు సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd Pulivendula branch I issue the following notice. My client company intends to grant a loan facility to **Smt Chinthakayala Khadar Bee** W/o Sukhur Basha, residing at 13/2465, Priya Thota, Vempalli Village & Mandal, YSR Kadapa Dt. under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions are any individual money lenders are hereby informed that if any objections regarding the said loan property, the public shall inform in writing within Five days from the date of this notice for the below mentioned property, otherwise it shall be deemed that there are no objections from anybody and any objections received after Five days will not binding upon my client's company for the below mentioned schedule property. **SCHEDULE**: YSR Kadapa District, Kadapa Registration District, Vempalli Sub-Registration District, Vempalli mandal, Vempalli Gramapanchayath boar, Vemapali village fields. 13 th ward Northern side of R&B guest house east Portion S.No. 263/2 an area measuring 300 Sq. Yards, open site within the following **BOUNDARIES**: East - Police Quarters, West - Open site of Mahammad Shafi, North - 9 feet own rastha,South - Open site of Chenchala Sudhakar. **In bitween open site measuring** : East-West-60 feet or 20 yards or 18.20 meters, North-south 45 feet or 15 yards or 13.65 meters, total 3.00 Sq. Yards or 252.00 meters measures comprise open site

A. Narasimha Reddy, M.A., B.Ed., B.L.
Advocate, Pulivendula

శాంతిభద్రతలకు ఆటంకం కలిగించొద్దు





సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గోవిందరెడ్డి.. సింహాద్రిపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న రామభక్తులు

చక్రాయపేట, జనవరి 20: శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సంద ర్భంగా శాంతిభద్రతలకు ఆటంకం కలిగించొద్దని సీఐ గోవింద రెడ్డి, ఎస్ఐ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సర్పంచులు, ఎంపీటీసీలు, రౌడీషీటర్లు, కేసులు ఉన్న వారందరినీ సమావేశప రిచి మాట్లాడారు. ఈనెల 22న ప్రతిష్ఠ కార్యక్రమం జరగనున్నం దున శాంతిభద్రతలకు ఎలాంటి ముప్పు వాటిల్లినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మతకలహాలు గాని, జూదాలు, కోడిపందేలు, మద్యం సేవించడం జరగకూడదన్నారు. ఊరేగిం పులు, సమావేశాలు, అన్నదానాలు జరిపే వారు ఉంటే అనుమతి తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించి కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఇడుపుల పాయ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రంగనాథ్ ఆధ్వర్యంలో ఇడుపుల పాయ, మారెళ్లమడక గ్రామాలకు సంబంధించి రౌడీషీటర్లు, కేసులు ఉన్న వారిని పిలిపించి కమిటీ ఏర్పాటు చేసి 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు.

రేపు గండిలో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు

అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గండి క్షేత్రం లో సోమవారం ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమ వారం ఉద యం 5 గంటల నుంచి సుప్రభాతం, ఉత్సవమూర్తు లకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, త్రికాల ఆరా ధన, నివేదన, శాత్తుమరై, మహామంగళ హారతి, తీర్థప్రసాద విని యోగం, శ్రీరాముల వారి రామనామ భజన, శ్రీరాములవారి చిత్ర పటానికి క్షేత్రోత్సవం, కూచిపూడి నృత్య ప్రదర్శన, కోలాటాలు, చెక్కభజనలు, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు.

సింహాద్రిపురంలో బైక్ ర్యాలీ

అయోధ్య రామ మందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఈనెల 22వ తేదీన జరుగుతున్న సందర్భంగా సింహాద్రిపురంలో శనివారం సాయంత్రం రామభక్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని నిడివెలగల ఆంజనేయస్వామి ఆలయంలో ప్ర త్యేక పూజలు చేసి, అనంతరం జైశ్రీరామ్ నినాదాలతో రామభ క్తులు బైక్ ర్యాలీ ప్రారంభించారు. సింహాద్రిపురం పట్టణంలో అం గళ్ల బజారు మీదుగా బుడ్డయ్యపాళెం సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామ మందిరంలో పూజలు నిర్వ హించి, వైఎస్సార్ సర్కిల్ వద్ద బైక్ ర్యాలీ ముగించారు. అలాగే సోమవారం ఉదయం నుంచి సీతా రాముల ఉత్సవ విగ్రహాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై గ్రామోత్సవం ఘ నంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రామభక్త సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. సింహాద్రిపురం రామాలయంలో సోమవారం బారీ అన్నదాన కార్యక్రమంకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి శ్రీరాములు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

సీకేదిన్నెలో అక్షింతలు పంపిణీ

చింతకొమ్మదిన్నెలో అయోధ్య అక్షింతలు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం పూర్తి చేశారు. గత నాలుగు రోజులుగా గ్రామంలో ప్రతిరోజు సాయంత్రం అక్షింతలు పంపిణీ కార్యక్రమాన్ని మంగళ వాయిద్యాలు, జెండాలు పట్టుకుని, కండువాలు ధరించరి ఇంటిం టికి తిరిగి అక్షింతలు పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అర్చ కులు వెంటరాగా ఇంటింటికి పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేసి ఆలయం వద్ద ప్రసాదాలు పంచిపెట్టారు.



చింతకొమ్మదిన్నెలో అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్న ప్రజలు

ఎలాంటి అల్లర్లూ జరగకూడదు: డీఎస్పీ

పులివెందుల టౌన్, జనవరి 20: పట్టణంలో ఎలాంటి అల్లర్లూ జరగకూడదని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మా ట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్యలో రామమందిరం నందు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతోందన్నారు. కావున శాంతిభద్రలు కాపాడా ల్సిన బాధ్యత మాది అని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐలు అరుణ్‌రెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ వాహనదారులకు సూచించారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో జాతీయ భద్రతా వారోత్స వాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమం లో పులివెందుల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.వి.ప్రసాద్, పులివెందుల రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

ఉరుసును విజయవంతం చేయండి

కడప (చిన్నచౌకు), జనవరి 20 : హిందూ ముస్లిం ఐక్యత ఉరుసును విజయవంతం చేయాలని జేకే జనం కోసం యూత్ సొసైటీ వ్యవస్థాప కుడు పఠాన్ ఖాదర్ బాషా, తాహిర్ కోరారు. అల్మాస్ పేటలో సిరాజుల్ మదరసాలో సయ్య ద్‌షా సర్‌మత్ కదిరి రహ్మతుల్లాహి అలే ఉరుసు పోస్టర్లను ఆవిష్కరించారు.



'ఎస్సీ వర్గీకరణ ఊసెత్తని జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపండి'

కడప (మారుతీనగర్), జనవరి 20: ఎస్సీ వర్గీకరణ ఊసెత్తని జగన్ రెడ్డిని ఇంటికి సాగనంపాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు పే ర్కొన్నారు. మాదిగల కన్నా మాల వర్గానికే వైసీపీ సర్కార్ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటికైనా త్వరితగతిన అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి పార్లమెంట్‌లో ఆమోదించేలా సిఫా రసు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మాదిగలంతా కలిసిక ట్టుగా జగన్‌రెడ్డిని ఇంటికి పంపించేందుకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఆ మేరకు శనివారం కడప ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈనెల 31న గుంటూరులో తలపెట్టిన మాదిగ, రెల్లి, డక్కలి ఉపకులాల యుద్ధభేరి మహాసభకు చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, తెలుగు రాష్ట్రాల కార్యదర్శి గొడుగనూరు మునెయ్య, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివకుమార్ మా దిగ, జిల్లా అధికార ప్రతినిధి జి.శ్రీనివాసులు, ఉపా ధ్యక్షులు రాములయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

● 40వ రోజుకు చేరిన అంగన్వాడీల దీక్షలు

కడప (నాగరాజు పేట), జనవరి 20 : ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గరప డ్డాయని అంగన్వా డీలు హెచ్చ రిం చారు. వేతనాలు పెంచాలని కోరుతూ అంగన్వాడీ కార్యక ర్తలు చేపట్టిన సమ్మె శనివారానికి 40వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగ న్వాడీలు ర్యాలీగా వెళ్లి మహావీర్ సర్కి ల్‌లో నిరసన చేపట్టారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు లక్ష్మీదేవి మాట్లా డుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించని ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. అంగన్వా డీల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదన్నారు. సీఐటీయూ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బాదుల్లా, డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వసుంధర, పోలమ్మ, సీఐటీయూ నాయకులు పవన్, గిరి, రమణ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కడప ప్రధాన శాఖ (00830) కడప జిల్లా

స్వాధీనతా ప్రకటన
SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13(4) క్రింద ఆస్తి స్వాధీనంకు సంబంధించిన ప్రకటన ప్రచురణ

ఖాతా నం. 39901208758, షేక్ గౌస్ బాషా తండ్రి మహమ్మద్ గౌస్, డి.నం.16/14, కొలిమి స్ట్రీట్, మైల్లా దర్గా, మాసపేట, కడప-516001 సెల్ నం. 7780604275 & 9550115424

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్ర మించిన అధికారాలను వినియోగిస్తూ సదరు ప్రకటన స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా ప్రకటనలో తెలిపిన బకాయి మొత్తం తిరిగి చెల్లించవలసిందిగా డిమాండ్ ప్రకటనను జారీ చేశారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూ ల్ 9తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు పేర్కొన్న తేదిన స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా పైన పేర్లు కలిగిన రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.సదరు ఆస్తులతో ఎటువంటి వ్యవహా రాలు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారాలైనా దానిపై వడ్డీ మరియు ఖర్చులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించుటకు లోబడియుంటాయి.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సమయం ఉన్నందున చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీత కోరబడుతున్నారు.

1. **ఖాతా/రుణగ్రహీత పేరు & చిరునామా:** షేక్ గౌస్ బాషా, తండ్రి ఎస్.మహమ్మద్ గౌస్, డి.నం.16/14, కొలిమి స్ట్రీట్, మైల్లా దర్గా, మాసపేట, కడప-516001
2. **ఆస్తి యజమాని పేరు మొదలైనవి:** షేక్‌గౌస్ బాషా
3. **తనఖాపెట్టబడిన/ఛార్జ్ చేయబడిన ఆస్తి వివరణ:** కడప జిల్లా, కడప జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నమోదు చేయబడిన విక్రయ దస్తావేజు డాక్యుమెంట్ నం. 3600/2020, తేదీ:16.07.2020, మరియు రెక్టిఫికేషన్ డీడ్ డాక్యుమెంట్ నం.5106/2020 తేదీ: 24.09.2020 క్రింద నమోదు చేయబడిన షేక్ గౌస్ బాషా, తండ్రి ఎస్.మహమ్మద్ గౌస్ పేరునగల ప్రస్తుత కడప నగర పాలక సంస్థ, కడప, మాసపేట, కొలిమి స్ట్రీట్, వార్డ్ నం.16, పాత డి.నం.16/415-ఎ, డి.నం.16/14 గల సర్వే నం. 30/2బి/1ఏ1లో గల 63 చ.గల విస్తీర్ణంలో స్థలం మరియు భవనం ఆస్తి యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: ఇతరుల ఇల్లు; పశ్చిమం: రోడ్డు; ఉత్తరం: ఉమ్మడి సందు మరియు తరువాత ఎస్. ఫరీదా ఇల్లు; దక్షిణం: ఎస్.ఖలీం, తాజుద్దీన్ ఇతరుల ఇల్లు.
4. 16.11.2023న **ఆంధ్రజ్యోతి & హన్స్ ఇండియా** దినపత్రికల్లో ప్రచురించబడిన డిమాండ్ ప్రకటన తేది09.11.2023, బట్వాడా కానందువలన ప్రచురించడమైనది.
5. **స్వాధీనతా తేది:**20.01.2024 **బకాయి మొత్తం:** రూ. 19,84,193/- మరియు ఖర్చులు, ఛార్జీలు మొదలైనవి.

అధీకృత అధికారి
ప్రదేశం: కడప తేది:20.01.2024 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కడప ప్రధాన శాఖ

అంగన్వాడీల సమ్మె ఉధృతం

మైదుకూరు, జనవరి 20 : తమ సమస్యలు పరిష్కరించాలంటూ గత 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. శనివారం మైదుకూరులో అంగన్వాడీ కార్యకర్తలు ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి రాయల్ కూడలి వరకు ర్యాలీ చేసేందుకు సమాయత్తమవ్వగా పోలీసులు ర్యాలీకి అనుమతి లేదంటూ నిలిపేశారు. అయితే శాంతియుత ర్యాలీ చేస్తున్నామంటూ అంగన్వాడీ కార్యకర్తలు రాయల్ కూడలికి చేరుకొని రహదారిపై బైఠాయించారు. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. సీఎం డౌన్‌డౌన్ అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా ప్రయాణికులు కొందరు దిగి రాకపోకలకు ఇబ్బందులు పెట్టవద్దని అంగన్వాడీ కార్యకర్తలను వేడుకోవడంతో తమ సమస్యలపై 40 రోజులుగా రోడెక్కి ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని ప్రయాణికులకు తెలియచేయడంతో వారుకూడా మద్దతు పలికారు. కాగా కొద్ది సేపు అనంతరం వాహన రాకపోకలను పంపించివేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్ళు పాల్గొన్నారు.

కొండాపురం..: మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు 40వ రోజు శనివారం కొండాపురంలో తమ నిరసన ను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె శనివారానికి 40వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా పూలే విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేసి రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.





జమ్మలమడుగు, మైదుకూరులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

పోరుమామిళ్ల..: అల్లా, ఏసు, ఈశ్వరుడిని కొలుస్తూ పోరుమామిళ్లలో అంగన్వాడీలు నిరసన తెలిపారు. తమ న్యాయమైనసమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శనివారానికి 40వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: ప్రభుత్వ మొండివైఖరి విడనాడి వెంటనే సమస్యలు పరిష్కరించాలని జమ్మలమడుగు అంగన్వాడీ అసోసియేషన్ నాయకులు కోరారు. శనివారం అంగన్వాడీల సమ్మెలో భాగంగా 40వ రోజు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ప్రధాన రోడ్డులో ర్యాలీగా వెళ్లి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ముందుగా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రసాద్, సీఐటీయూ నాయకులు దాసరి విజయ్, యేసుదాసు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: ప్రభుత్వం దిగివచ్చేవరకు సమ్మె విరమించబోయేది లేదని అంగన్‌వాడీ నేతలు హెచ్చరించారు. శనివారం స్థానిక శివాలయం సర్కిల్లో అంగన్ వాడీలు రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా ఒన్‌టౌన్‌ఎస్ఐ హైమావతి రాస్తారోకో ను అడ్డుకోబోయారు.సిపీఎం సత్యం ఎస్ఐ హైమావతి మధ్యవాదనలు జరిగాయి. అనంతరం వారు రాస్తా రోకోను విరమించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌నేతలు పాల్గొన్నారు.

పుట్టా ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరిక



పార్టీలోకి చేర్చుకుంటున్న పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు, జనవరి 20 : వ్యవసాయ మార్కెట్ కమీటీ మాజీ ఛైర్మెన్ బీఎన్‌శ్రీనివాసులతో పాటు పలు కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. శనివారం సాయంత్రం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్‌కు రాయల్ కూడలి నుంచి ఘన స్వాగతం పలికారు. బీఎన్ శ్రీనివాసులతో పాటు మైదుకూరు మున్సిపాలిటీలోని దాదాపు 250 కుటుంబాల వారిని పుట్టా సుధాకర్‌యాదవ్ కండువాలు కప్పి పార్టీలోనికి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు దాసరి బాబు, జనసేన ఇన్‌చార్జ్ మల్హోత్ర, నాయకులు ఆకుల కృష్ణ, రామచంద్రనాయుడు, కందనూరు గోపి, కటారు కృష్ణ, పాల మాబు, ధనపాల రవి గుండంరాజు సుబ్బయ్య, కొండపల్లి ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూపేశ్‌రెడ్డి సమక్షంలో...



జమ్మలమడుగు, జనవరి 20: జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో శనివారం పెద్దముడియం మండలం భీమగుండం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కండువా కప్పుకున్నారు. వచ్చినవారికి ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారు పుల్లారెడ్డి, పార్థసారధి రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు, వెంకటరమణ, రాజు, తదితరులు పది కుటుంబాలవారు టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

పలువురు జనసేనలోకి...



దువ్వూరు (మైదుకూరు), జనవరి 20 : మండలంలోని కానగూడూరుకు చెందిన కందుల నాగయ్య, కొట్టే సుధాకర్, సునీల్, పూల ప్రసాద్ తదితర దాదాపు 50 కుటుంబాలవారు జనసేన పార్టీలో చేరారు. శనివారం సాయంత్రం జనసేన నాయకులు పాశం లక్ష్మీ నరసయ్య ఆధ్వర్యంలో దాదాపు 50 కుటుంబాలకు చెందిన వారు పలువురు మహిళలతో కలసి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పాశం రామ్మోహన్, రమణ, జయరాముడు, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీ ప్రభుత్వమే :విజయమ్మ



కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ,రోశన్న

కాశినాయన జనవరి20: టీడీపీకి అధికారాన్ని కట్టబెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బద్వేల్ మాజీఎమ్మెల్యే కే.విజయమ్మ పేర్కొన్నారు.శనివారం బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జ రోశన్నతో కలిసి ఓబులాపురం,పిట్టిగుంట, తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి,జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి,తెలుగు యువత అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, టీడీపీ నాయకులు పి.పోలిరెడ్డి,ఓ.రోహిత్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రోశిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి,వెంకటేశ్వర్లు,ఎం.అమర్‌నాథ్‌రెడ్డి,నరసింహారెడ్డి,బి.రాజశేఖర్‌రెడ్డి,బిరామసుబ్బారెడ్డి, ఎం.విజయ్‌కుమార్‌రెడ్డి, కే.దుగ్గిరెడ్డి ఇతర నాయకులు కార్యకర్తలు అబ్జర్వర్లు పాల్గొన్నారు.

పోష్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ

బద్వేలు రూరల్, జనవరి 20: లైంగిక వేధింపుల నిరోధక చట్టం పోష్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఛైర్ పర్సన్ మండల న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో అన్ని శాఖల అధికారులతో పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి,లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు,పరిష్కారానికి సంబంధించిన విషయాల కోసం పోష్ చట్టం చేయబడిందన్నారు. పోష్ చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రతి కార్యాలయంలో నోటీసు బోర్డులో అంటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రి, ఏపీపీ రవిచంద్ర, న్యాయవాదులు బ్రహ్మారెడ్డి, కృష్ణ, పోలీసు అధికారులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

బద్వేలు, జనవరి 20: ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ విస్తృత కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేస్తామని ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి నేటికి ఐదు సంవత్సరాలు అవుతున్నా ఒక్కటీ ఆచరణలోకి తీసుకురాలేదని, రాష్ట్రంలో వైసీపీ సర్కార్, కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి సాగిలా పడిపోయిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, చంద్రమోహన్‌రాజు, పిడుగు మస్తాన్, పి.బాలు, రమణ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీరామచంద్రుల జపమహాయజ్ఞం

బద్వేలు, జనవరి20: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థాన ఆవరణలో ఈ నెల22వ తేదీన అయోధ్య రామమందిరంలో శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు జరుగుతుందన్నారు. 4.30 గంటల తర్వాత ఎవరినీ అనుమతించరని, అంతకు ముందుగానే రావాలని సూచించారు. ఈ మహాయజ్ఞంలో శ్రీరామచంద్రుల వేషధారణ పోటీలు నిర్వహిస్తామని, ఇందులో పాల్గొనే బాలల వయస్సు 5 నుంచి 10 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. ఇందులో గెలుపొందిన చిన్నారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా శ్రీరామ చంద్రుని చిత్రపటం అందజేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 9848462457 నంబరును సంప్రదించాలన్నారు.

రామాలయాలకు పట్టువస్త్రాలు పంపిణీ

కొండాపురం, జనవరి 20 : ఆయోధ్యలో సోమవారం రాములవారి ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి అందజేసిన పట్టువస్త్రాలను మండలంలోని రామాలయాలకు శనివారం బీజేపీ నాయకులు పంపిణీ చేశారు.సోమవారం రామాలయాల్లో వాటిని రాముల వారికి అలంకరించాలని ఆలయ నిర్వాహకులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏటూరు రమణారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు నాగిరెడ్డి, బీజేపీ నాయకుడు విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు భారీ ర్యాలీ

మైదుకూరు, జనవరి 20 : అయోధ్యలో సోమవారం బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం మైదుకూరులో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. స్థానిక మేధా డిఫెన్స్ అకాడమీ ఆవరణలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. హిందూ భక్తులందరూ పాల్గొని విజయవంత చేయాలని నిర్వాహకులు కోరారు.

ప్రశాంతంగా వేడుకలు జరపాలి

పోరుమామిళ్ల, జనవరి 20 : ఈ నెల 22న అయోధ్య రామమందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని ప్రజలు ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని సీఐ చిరంజీవి అన్నారు. శనివారం సాయంత్రం పోరుమామిళ్ల పోలీసుస్టేషన్ ఆవరణలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఏమైనా అవాంఛనీయ సంఘటనలకు ప్రయత్నిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

అయోధ్య కరపత్రాలు, జెండాలు పంపిణీ

బ్రహ్మంగారిమఠం, జనవరి 20 : మండలంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఆర్యవైశ్య కుటుంబ సభ్యులకు సోమవారం అయోధ్య నిర్మిస్తున్న నూతన బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠకు సంబంధించిన కరపత్రాలు ఇంటిపై ఎగురవేయడానికి హనుమాన్ కాషాయ జెండాను ఇంటింటికీ అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థాన అధ్యక్షుడు క్రిష్ణమూర్తి , సంఘం నేతలు ఎస్.నాగేశ్వర్‌రావు,ఎం.వెంకటేశ్వర్లు, ఎం.శేషయ్య, పి,రామచంద్రయ్య, నాగేశ్వర్‌రావు, చలమయ్య, ఆర్యవైశ్య కుటుంబసభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, జనవరి 20 : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పుష్య మాసం రెండో శనివారాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం అనంతరం పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

రాచమల్లూ...చిల్లర మాటలు మానుకో..!

చంద్రబాబును విమర్శించేఅర్హత లేదు : టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు ఆగ్రహం



మాట్లాడుతున్న సీఎం సురేశ్ నాయుడు తదితరులు

ప్రొద్దుటూరు , జనవరి 20 : కమలాపురంలో జరిగిన రా..కదలిరా సభ లక్షలాదిమందితో విజయవంతం అయిందని దాన్ని చూసి ఓర్వలేని ఎమ్మెల్యే రాచమల్లుప్రసాద్‌రెడ్డి సభపై చిల్లర మాటలు మాట్లాడటం అతని దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని టీడీపీ నాయకుడు సీఎం సురేశ్ నాయడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక పాతబస్టాండ్ వద్ద అన్నక్యాంటీన్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి చంద్రబాబు మూడు సార్లు ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా పనిచేసిన అనుభవం వున్న నాయకుడని ఆయనను విమర్శించే స్థాయి, అర్హత రాచమల్లుకు లేదన్నారు. రాచమల్లు అబద్ధాలు, దౌర్జన్యాలు ప్రొద్దుటూరు ప్రజలు చూశారన్నారు. రాచమల్లు ప్రమాణాలకు అందరు దేవతలు అయిపోయారని ఇక వున్నది జగన్‌దేవుడు ఒక్కడేనన్నారు. జగన్ పని కూడా అయిపోయిందన్నారు. ప్రొద్దుటూరులో ఎలక్షన్ కోడ్‌రాకముందే ఎప్పుడూ లేని విధంగా ఈ ప్రభుత్వంలో పోలీసులు తనిఖీల పేరుతో రైతులు, వ్యాపారుల వద్ద నగదును పట్టుకోవడం దారుణమన్నారు. ఎస్పీసిద్ధార్థ కౌశల్ ప్రొద్దుటూరు ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ఇలాంటి తనిఖీలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. టీడీపీ నాయకుడు బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ పోలీసులు ప్రొద్దుటూరులో వ్యాపారులను ఇబ్బందులు పెట్టే రీతిలో తనిఖీలు చేస్తున్నారన్నారు. మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఈ ప్రభుత్వంలో 2026 వరకు గన్‌లైసెన్సులకు గడువు వున్నప్పటికీ ఆయుధాలు స్వాధీనం చేసుకుంటున్నారన్నారు.మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ముక్తియార్ మాట్లాడుతూ ప్రొద్దుటూరులో రాచమల్లు ఏమి చెబితే అది పోలీసులు చేస్తున్నారని ఆరోపించారు.

పట్టించేది.. సానుభూతి చూపేది రాచమల్లే : ప్రవీణ్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు , జనవరి 20 : ప్రొద్దుటూరులో తనిఖీల పేరుతో వ్యాపారులు, రైతుల వద్ద వున్న నగదును పోలీసుల చేత పట్టించేది, మళ్లీ వ్యాపారుల వద్దకు వెళ్లి ధర్నాలు చేసి సానుభూతి చూపేది ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డినే అని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక టీబీ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 30 బాటిళ్ళు మద్యంను తీసుకెళుతున్నాడని ఎస్‌ఈబీ పోలీసులు పట్టుకుంటే ఏకంగా ఎస్‌ఈబీ కార్యాలయానికి వెళ్ళి పోలీసులను దూషించి దౌర్జన్యం చేసి అక్రమ మద్యం తీసుకెళుతున్న వ్యక్తిని విడిపించుకుని వెళ్ళిన ఎమ్మెల్యే రాచమల్లు టూటౌన్ సీఐ ఇబ్రహీం దగ్గరకు వెళ్ళి గట్టిగా నిలదీయలేదన్నారు. బిడ్డ పెళ్ళికోసం బంగారు కొనడానికి వెళ్ళిన రైతు నుంచి 14.50 లక్షలుతీసుకుంటే ఎందుకు విడిపించుకు రాలేకపోయావన్నారు. పోలీసు స్టేషన్ వద్ద వ్యాపారులతో కలిసి ధర్నా చేయవలసింది పోయి బంగారు అంగళ్ళ దగ్గర ధర్నా చేయడమేమిటన్నారు. సీఐ ఇబ్రహీం నుంచి వాటాలు తీసుకుంటున్నావు కాబట్టే అతన్ని నిలదీయలేకపోయావన్నారు. ఎమ్మెల్యే వాహనంలో కోట్ల రూపాయలు డబ్బుపెట్టుకుని తిరుగుతుంటే ఏనాడైనా తనిఖీలు చేశారా అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మెన్ జబీవుల్లా, టీడీపీ నేత విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై చర్యలు తప్పవు

జమ్మలమడుగు, జనవరి 20: ఏ కార్యాలయంలోనైనా మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడితే బాధిత మహిళలు వెంటనే ఫిర్యాదు చేస్తే ఎంతటి అధికారిపై అయినా చర్యలు తప్పవని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి సూచించారు. శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణంలో లైంగిక వేధింపులకు సంబంధించి మహిళా ఉద్యోగులకు సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జంబాపురం మహేశ్వరి, జ్యోతి, భాస్కర్‌రెడ్డి, జాకీర్, సూర్యపెద్దిరాజు, మునీరా, జయన్న, సీడీపీవో రాజేశ్వరి, సూపర్‌వైజరు గౌసియా, ఇన్‌చార్జి ఎంపీడీవో జ్ఞాన సుందరమ్మ, లోక్ అదాలత్ సభ్యురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార భవనాలకు శంకుస్థాపన

మైదుకూరు, జనవరి 20 : వ్యవసాయ మార్కెట్ కమిటీ పాత కార్యాలయం ఆవరణలో 1.20 కోట్లతో వ్యాపార భవనాలు నిర్మించేందుకు శనివారం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ ఆవరణలో నిర్వహిస్తున్న సంతను బద్వేల్‌రోడ్డులోని గజ్జితిప్ప వద్దకు మార్చడం జరిగిందని, ఇక్కడ వ్యాపారాల కోసం 13 భవన సముదాయాలు నిర్మించేందుకు భూమి పూజ చేపట్టినట్లు రఘురామిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపేల్‌రెడ్డి, యువ నాయకుడు శెట్టిపల్లె నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ శ్రీమన్నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, భూమిరెడ్డి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

'ఆయన తీరు మార్చుకోవాలి'

పోరుమామిళ్ల, జనవరి 20 : బద్వేలు టీడీపీ యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి తీరు మార్చుకోవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునిరెడ్డి, టీడీపీ నియోజకవర్గ నాయకుడు ఓబులాపురం రాజశేఖర్, కాశినాయన మండల నాయకుడు వెంకటరెడ్డి, కలసపాడు నాయకుడు బాలిరెడ్డి, కమ్మవారిపల్లె నాయకుడు చెరుకూరి రవికుమార్, మాజీ జడ్పీటీసీ శిరీషా పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న ఫంక్షన్ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు కమలాపురానికి వచ్చిన సందర్భంగా చెరుకూరి రవికుమార్‌పై రితీష్‌కుమార్‌రెడ్డి వ్యవహరించిన తీరు సరికాదన్నారు. అందరితో కలుపుగోలుతనంగా ఉండి బద్వేలులో టీడీపీ జెండా ఎగరవేయడానికి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జయరాంరెడ్డి, ప్రహ్లాదరెడ్డి, పి.బాలక్రిష్ణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న కెనరా బ్యాంకు అధికారి నాగరాజు

జమ్మలమడుగు, జనవరి 20: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీ సచివాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మెప్మా అధికారి గంగులయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, రాయలసీమ మైనార్టీ మోర్చ నాయకులు రఫి, హౌసింగ్ ఏఈ ఓబులేసు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు సీవీఎస్ ప్రశాంత్ ఎంపిక

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 20 : అంతర్‌రాష్ట్ర సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు ప్రొద్దుటూరుకు చెందిన సీవీఎస్ ప్రశాంత్ వికెట్ కీపర్‌గా ఎంపికయ్యారు. ఈనెల 23 నుంచి గోవాలో అంతర్‌రాష్ట్ర సౌత్‌జోన్‌క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఇటీవల గుంటూరు జిల్లా పేరేచర్లలో జరిగిన జోనల్ మ్యాచ్‌లో ప్రశాంత్ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు.



బీసీలు రాజ్యాధికారం సాధించినప్పుడే సమానత్వం



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళ్ రావు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 20 : బీసీలు రాజ్యాధికారం సాధించినప్పుడే సమానత్వం సాధించగలరని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళ్ రావు పేర్కొన్నారు. శనివారం బీసీల రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్ర్య పోరాటం రథయాత్ర సభను ఎన్జీఓ హోంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 140 బీసీ కులాలు ఉన్నా చట్టసభలకు పోయిన బీసీలు అతి కొద్దిమందే ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి, ప్రాధాన్యత ఉన్న పదవులన్నీ అగ్రకులాల వారే అనుభవిస్తున్నారని, ఈబీసీలకు ఎటువంటి ప్రాధాన్యత కల్పించడం లేదన్నారు. చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, మహిళా రిజర్వేషన్‌లో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలు కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని నిలిపి గెలిపించుకోవాలని సూచించారు. జాతీయ బీఈ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ల అయినా బీసీలకు ఇప్పటికీ స్వాతంత్ర్యం రాలేని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బీసీలను వాడుకుని వదిలేస్తున్నాయన్నారు. ముందుగా మైదుకూరు రోడ్డులోని జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళి అర్పించి ఎన్జీఓ హోం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెన్నా సరళాదేవి, తొగటవీరక్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణరాజు, కార్యదర్శులు గురుమూర్తి యాదవ్, రెడ్డయ్య, కత్తి విజయ్‌కుమార్, టి.దుర్గారావు, విజయవాడ పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, చింతల కృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుభాన్‌బీ, లక్ష్మీదేవి, జింకా రాజశేఖర్, ప్రభుకుమార్, జింకా జయప్రకాష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.